# బచావో..!

-కవన శర్మ

"మీరు ఇళ్ళు ఖాళీ చెయ్యాలిరా! బాబులూ!" అన్నాడు ఇంజినీరు ఆటవికుల నుద్దేశించి.

"మనం ఇళ్ళు ఖాళీ చెయ్యవద్దు" అన్నాడు సోమయ్య ఉద్రేకంగా తోటివారి నుద్దేశించి.

"చెయ్యం" అన్నారు తోటివారు. వాళ్ళ దేహాలు వింటిబద్దల్లా బలంగాను సన్నంగా వంపుదేలి ఉన్నాయి.. వాళ్ళ కళ్ళు బాణాల మొనల్లా ఇంజనీరుని తీక్షణంగా గుచ్చుతున్నాయి. వాళ్ళు పరిగెత్తడానికి సిద్ధంగా ఉన్న అందమైన లేళ్ళలా లేరు. దూకడానికి సిద్ధంగా ఉన్న చిరుతపులుల్లా ఉన్నారు.

"చెయ్యకపోతే మెషీన్లు తెచ్చి కూల్చేయాల్సి వస్తుంది. నామాట వినండయ్యల్లారా! వినేటట్టు చెయ్యండమ్మల్లారా" అని ఇంజినీరు అనునయిస్తున్నట్టూ, బెదిరిస్తున్నట్టూ ఏదో తెలియకుండా అన్నాడు. తనమటుకు తాను పరిస్థితులు ఎటుపోయి ఎటువస్తాయోనని బెదురుతున్నాడు.

"మెషీన్ల నడ్డుకొంటాం. నీ మాట వినుకోం" అన్నాడు భీమయ్య.

"అప్పుడు పోలీసులు వస్తారు. అరెస్టులు చేస్తారు. జైళ్ళల్లో పెడ్తారు అన్నాడు ఇంజినీరు తమాషాకి అన్నట్టు నవ్వుతూ.

దానికి అక్కడికి చుట్టపుచూపుగా వచ్చిన ముసలి అతను నవ్వుతూ "మంచిదే! కనీసం ఈ గూడెంవాళ్ళకి జైల్లోనైనా ఉండేందుకు కూడు దొరుకుతుంది. పురుగులదే అయినా గూడు దొరుకుతుంది. ఇళ్ళు ఖాళీచేస్తే ఏమౌతుంది! యాభై ఏళ్ళ క్రితం ఇళ్ళు ఖాళీచేసిన మాకేమయిందో అదే అవుతుంది. మాకు ఇళ్ళూ లేవు. జైళ్ళూ లేవు" అని ఇంజనీరుతో అని ఆపైన " ఓరి కొడుకుల్లారా! కూతుళ్ళలారా! ఇళ్ళు ఖాళీచేస్తే చేసారు ఆ తరువాత జైళ్ళు ఖాళీ చెయ్యకండి" అన్నాడు అక్కడి జనంలో కొందరు, కొంతకాలంగా, వాళ్ళకి వాళ్ళ హక్కులేమిటో చెప్తున్నారు. "పెద్ద పెద్ద డామ్స్ కట్టినప్పుడు నిర్వాసితులైన వాళ్ళలో నూటికి నలభై నుంచి ఎనభై శాతం వరకు ఇంకా భూమిమొత్తం మీద నిర్వాసితులు గానే ఉన్నారు. ఇవాల్టి ప్రభుత్వ వాగ్దానాలన్నీ నీటిమీద వ్రాతలు. బాగుపడేవారు కొందరు. బలైపోయేవారు మరికొందరు. బాగుపడే వారు చాలామంది. అందులో మీరుండరు. బలైపోయే కొద్దిమందిలో మీరుంటారు. మీరు అడవిలో పుట్టిందే త్యాగాలు చెయ్యటానికి" అంటూ ఆ గూడెం చెవుల్లో గూళ్ళు కట్టి చెప్పసాగారు.

"మేం మీకు మీ చెవుల్లో కట్టిన గూళ్ళే మీకు మిగిలే గూళ్ళు తస్మాత్ జాగ్రత్త!" అని హెచ్చరించారు.

"చెప్పే వాళ్ళ సొమ్మేం పోయింది అల్లాగే చెప్తారు. చెప్పుడు మాటలు విన్న వారు చెడిపోతారు. మమ్మల్ని నమ్మండి. నమ్మితే చెడినవారు లేరు" అంది ప్రభుత్వం.

"ఛ! ఛ! అదేం మాట. నమ్మి చెడ్డవాళ్ళం మేముండగా మీరెందుకల్లా మొహమాటంగా అనుకొంటారు." అన్నారు యాభైయేళ్ళ క్రితం ప్రభుత్వాన్ని నమ్మి చెడినవారు.

***

ఈ యాభై యేళ్ళుగా చాలా జరిగాయి.. అంతకుముందూ జరిగాయి. సరితా నది విషయంలో దానిమీద డామ్ కట్టే విషయంలో.

ప్రభుత్వం ఏం చేసినా అందరి బాగు కోసమే చేస్తుంది. కాని కొందరు దురదృష్టవంతులు అందరితో బాగుపడక నష్టపోతుంటారు. ఒకసారి దానికి అలవాటు పడ్డాక ఎప్పుడూ ఆ దార్లోనే వాళ్ళు నడుస్తూంటారు. ఎందుకంటే మిగిలిన అందరు వాళ్ళకాదారి మాత్రమే విడిచిపెడ్తారు నడవటానికి. అయితే చాలామంది బాగుకోసం కొందరు బలవటం తప్పు కాదన్న సూత్రం అన్ని దేశాల్లో, అన్ని కాలాల్లో అమలులో ఉన్న సూత్రమే. త్యాగధనులెప్పుడూ ఆ కొందరే. అందరికి త్యాగాలు చేయటం రావద్దూ! అందుచేత త్యాగాలు చెయ్యటం అలవాటైన వారిచేతే చేయించాలి. త్యాగాల మాట అనేమిటి? ఏ పనైనా చేతనైన వారి చేతే చేయించు అన్నది దక్షతా సిద్ధాంతం కదా!

పుణ్యభూమిలో దక్షులు చాలామంది ఉన్నారు. అందుకని వారా దేశంలో సరితానది సమస్య అయి కూర్చున్నప్పుడు తలలు ఒకచోట చేర్చి పరిష్కారం కనుక్కున్నారే కాని తలలు పట్టుక్కూర్చోలేదు.

ఆ దేశంలో సరితానది ఎగువన ఎగుడు రాష్ట్రం, దిగువున దిగుడు రాష్ట్రం ఉన్నాయి. అవి ఒకప్పుడు సరితానదీ జలాలు పంపిణీ విషయంలో తగువులు పడ్తూ ఒకటి ఎగదీస్తే రెండోది దిగదీస్తూ ఉండటం వల్ల ఆ రాష్ట్రాలకా పేర్లు వచ్చాయని కిట్టని పొరుగు రాష్ట్రాల వారంటూ ఉంటారు. కాని అదెప్పటి మాటో! కాని ఇప్పుడు రెండు రాష్ట్రాలు 'ఎదుగుడు' గురించి ఏక నాలికగా మాట్లాడ్తున్నాయి. ఈ ఎదుగుడుకి చాలా అవసరమైనది సరితానదిమీద యాభై సంవత్సరాల క్రితం కట్టిన డామ్ ఎత్తు ఎదగటం. దాని ఎత్తు ఎదిగితే కొన్ని లక్షలు ఎకరాలు అదనంగా సాగుబడిలోకి వస్తాయి. అయితే కొన్ని వందల మంది గోచీపాతరాయుళ్ళ కొంపలు మునిగిపోతాయి. ఈ కొద్ది నీడను చూసి భయపడి అభివృద్ధి దీపం వెలిగించటం మానలేము. ఖర్చుతోను, నష్టంతోను పోలిస్తే లాభం బోలెడు రెట్లు. ఆర్థిక శాస్త్రవేత్తలు బెనిఫిట్ కాస్ట్ రేషియోలు లెక్కలు గట్టారు. కాని వాటిని కొందరు లెక్కపెట్టక గోచీపాతరాయుళ్ళ చేలే విలువైనవంటూ ప్రచారంచేసి పనీపాటు లేని ప్రజల సానుభూతి సంపాదించారు.

''వాళ్ళ కొంపలు ముంచితే మేమూరోకోం. ఆందోళనలు చేపడ్తాం. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.'' అన్నారు వాళ్ళు.

యాభై సంవత్సరాల క్రితం దేశం ఇప్పట్లా లేదు. ప్రభుత్వం ఏం చేసినా 'శభాష్' అన్నవారే కాని 'మటాష్' చెయ్యబూనినవారు లేరు. ఆ రోజులు బంగారు రోజులు.

సరితానది వయస్సు వచ్చిన ఆడపిల్ల పొంగులతో అలరారినట్లు, వరదలు పొంగగా తుళ్ళుతూ పారేది. పరవళ్ళు తొక్కుతూ ఎప్పుడైనా పంట పొలాలని, పల్లెలని ముంచేది. ముంపుకి గురైన భూములు, పల్లెలు పల్లాన్న దిగుడు రాష్ట్రంలో వీళ్ళకి మిత్రులు బంధువులు ఇప్పటికీ ఉన్నారు. వాళ్లూ సంపన్నులే! వీళ్ళకి వాళ్ళకి పలుకుబడికి లోటులేదు. సముద్రంలోకి వ్యర్థంగా మంచినీళ్ళు పోతున్నాయనీ, పంటలు నాశనమై పోతున్నాయనీ, అందుకని సరితానది ముక్కుకి తాడు వేయాల్సిన అవసరం ఉందని వీరు వారు కలసి ఓ డామ్ దాని ఎగువన ఎగుడు రాష్ట్రంలో కట్టించగలిగారు.

అప్పుడు కొన్ని వందల మంది అగణీయులు నిర్వాసితులైతే అయ్యారేమో కాని, ఎగుదు దిగుడు రాష్ట్రాలలో కొన్ని వందల వేల ఎకరాలు సాగుబడిలోకి వచ్చాయి. గణనీయుల భూములు ముంపుకి గురవటం తగ్గిపోయింది. వాళ్ళలో భద్రతాభావం నెలకొని, సుఖశాంతులై వర్ధిల్లుతూ వచ్చారు.

అయితే సరితానదిప్పుడు పెళ్ళికాని కన్యలా కాక ఉమ్మడి కుటుంబంలో చాకిరీకి పనికివచ్చే ఇల్లు పట్టిన విధవాడబడుచులా నిదానంగా ఉంటోంది. ఆమె శక్తిని ఎగుడువారు దిగుడువారు వాటాలు వేసుకొని పంచుకుంటూ వచ్చారు.

ఉత్తినే చాకిరి చేసే వాళ్ళుంటే పని అదే

''వేం కట్టెలు కొడ్తే అడవులు తరిగిపోతాయి. కాయితం పరిశ్రమలకి కలప కార్ఖానాలకి అడవులు కూల్చేయటం పురోభివృద్ధి. మేం సారా కాచుకొంటే మా కడుపులు కాలిపోతాయి. విదేశీ సారాయి స్వదేశంలో తయారుచేసి అమ్మితే కొనుక్కుని తాగితే నాగరికత. తినడానికి ఒక జంతువుని చంపితే అది వన్యప్రాణి సంరక్షణకి వ్యతిరేకం. సరదాకి, పెద్దల విందులకి చంపడం తప్పుకాదు. ఇన్నివేల సంవత్సరాలు మేము అడవుల్లో ఉన్నాం. మా వల్ల అడవులు తరిగాయా? పారిశ్రామిక విప్లవానంతరం అనాటవికుల దురాశలకి బలైపోయాయా అడవులు?''

పెరుగుతుంది. రెండు రాష్ట్రాలవారు నీళ్ళు పుష్కలంగా జీవధారలా దొరుకుతుంటే క్రమేపి పండించే ఎకరాలు, ఎకరానికి పండించే పంటల సంఖ్య పెంచుకుంటూ పోయారు. దాంతో మాకు చాలినంత నీరు వదిలిపెట్టడం లేదని దిగుడు రాష్ట్రంవారు, మాకే నీళ్ళు లేవు మీకేం వదలమని ఎగుడు రాష్ట్రం వాళ్ళూ తగవులు పడటం మొదలుపెట్టారు.

పనిచేసే ఆదిది కొద్ది గంటలు పెందరాళేలేచి కొద్ది గంటలు ఆలస్యంగా నిద్రపోతే మరింత పనిచెయ్యగలదు. అల్లాగే నదిమీది కట్ట ఎత్తు మరికొంచెం పెంచితే మరిన్ని నీళ్ళు నిలవ ఉండి నీటి తగవు తీరుతుందన్న ఆలోచన ఇంజినీర్లిచ్చారు. 'సరే అంది ప్రభుత్వం'. 'భలే' అన్నారు లబ్దిపొందే జనం.

నష్టపోయే జనం 'ఘొల్లు'మన్నారు. అంతకు పూర్వం నిర్వాసితులైన వారి బంధువులకి ఉన్న గోచీలు కూడా ఊడిపోడం చూసి 'ససేమిరా' అన్నారు. నష్టానికి పరిహారం ఉండదు. దాన్ని "పాపహారం అనాల"న్నారు. "కొత్త ప్రదేశాల్లో బతకడానికి కావలసిన కొత్త తెలివితేటలు కొత్త నైపుణ్యాలు మాకు లేవు ఇక్కడలా అక్కడ బతకలేము. ఎప్పుడూ లాభంమీకూ నష్టం మాకూనా?" అంటూ ప్రశ్నించారు.

" ఇల్లా కూడా మమ్మల్ని బతకనీయరా?" అని ఆక్రోశించారు.

"మేం కట్టెలు కొడ్తే అడవులు తరిగిపోతాయి. కాయితం పరిశ్రమలకి కలప కార్ఖానాలకి అడవులు కూల్చేయటం పురోభివృద్ధి. మేం సారా కాచుకొంటే మా కడుపులు కాలిపోతాయి. విదేశీ సారాయి స్వదేశంలో తయారుచేసి అమ్మితే కొనుక్కుని తాగితే నాగరికత. తినడానికి ఒక జంతువుని చంపితే అది వన్యప్రాణి సంరక్షణకి వ్యతిరేకం. సరదాకి, పెద్దల విందులకి చంపడం తప్పుకాదు. ఇన్నివేల సంవత్సరాలు మేము అడవుల్లో ఉన్నాం. మా వల్ల అడవులు తరిగాయా? పారిశ్రామిక విప్లవానంతరం ఆనాటవికుల దురాశలకి బలైపోయాయా అడవులు?" అంటూ పురాల్లో చదువుకొన్న గిరిజనులు, పర్యావరణ పరిరక్షకులు బలపరుస్తూంటే అడగటం నేర్చుకున్నారు.

***

ప్రభుత్వం పూర్వంలా దండోపాయానికి నేరుగా దిగలేకపోతోంది. సామ, దానోపాయాల ద్వారా ప్రయత్నించాలని చూస్తోంది. దండించగలము సుమా అన్న బెదిరింపు మాత్రం తగు మోతాదులో కలుపుతోంది.

"తగువెందుకు తమ్ముడూ! మనకి మరోదారి లేదా?" అని అడిగింది సోమయ్య నో అక్క

"లేకేం ఉంది. వాళ్ళు చెప్పిన రేటుకి మన భూములు వాళ్ళకి స్వాధీనం చేసి మరోచోట అమ్మే వాళ్ళు చెప్పే అయిదురెట్ల రేటుకి భూమి కొనుక్కుని, బోరు వేసుకోనూ, ఎరువులు, పురుగుల మందులు కొనుక్కోనూ అప్పులుచేసి అవి తీర్చలేక మిగిలిన పురుగు మందు, కల్తీసారాలో కులపుకుతాగి పుసుక్కున చచ్చిపోవచ్చు" అని చెప్పాడు సోమయ్య.

"అది చెయ్యటం మరి కష్టమే! అదికాక మరేం చెయ్యాలో చెప్పు" అన్నాడు ఓ బావ.

" ఏం చెయ్యాలా! రేపు మన కొంపలు కూల్చడానికి బుల్‌డోజర్స్ తెస్తారుట. అవిరాకుండా దారికడ్డుపడాలి" అన్నాడు భీమయ్య

"అల్లాగే చేద్దాం." అని నిర్ణయించారు అక్కడి జనం.

మర్నాడు కొద్ది యంత్రాలతో అంతే బలగంతో వచ్చిన ప్రభుత్వ యంత్రాంగం చిక్కుల్లో పడింది. యంత్రాలు తెచ్చిన వాళ్ళకి ఇళ్ళు కూల్చడానికి ఆర్డర్స్ ఉన్నాయి కాని జనం మీదుగా నడపడానికి ఆజ్ఞలు జారీ కాలేదు. దానికి జిల్లా అధికారులు రావాలి. వస్తారో లేదో! కనీసం వాళ్ళని రమ్మని కబురు చెప్పి మనవి చేసుకోవాలి. ఇంజినీరు తన మనిషిని పంపాడు.

అంతవరకు ముగ్గురు డ్రైవర్లు ఐదుగురు భద్రతాసిబ్బంది పదిమంది ఇంజినీరింగ్ సిబ్బంది ఏం చెయ్యాలి? వాళ్ళ తిండీతిప్పలూ ఎవరు చూస్తారు? మామూలుగా గ్రామస్థులే తమ వీలైన ఆతిథ్యం ఇచ్చేవారు. ఈ రాత్రి వాళ్ళు గంజీ పొయ్యరు, కల్లూ పొయ్యరు. అసలు దారికడ్డంగా పురుషులతోపాటు పడుకున్న స్త్రీలు లేస్తే కదా! వాళ్ళ ఇళ్ళల్లోని పొయ్యిల్లోని పిల్లులైనా లేవటానికి.

చుట్టం తాత రాజీమార్గం చెప్పాడు. ఆటవికులు ప్రభుత్వ సిబ్బందికి కాస్సేపు ఆటవిడుపు ఇచ్చేటట్టు ఆ టైములో వాళ్ళు పల్లానికి పోయి భోజనాలు కానిచ్చుకుని వచ్చేటట్టు ఉద్రిక్తత తగ్గకుండా శాంపుల్‌కి సోమయ్య భీమయ్య అంతవరకు పడుక్కుని ఉంటారని తమ బుల్‌డోజర్ ఎక్కి వాళ్ళని లెమ్మని ప్రభుత్వం తరపున అదమాయిస్తూ ఉంటానని చెప్పాడు. అంతకంటే మంచి ఉపాయం లేక ఇంజినీరు 'సరే'నన్నాడు.

"బాబుల్లారా! మేము మీ ఆస్తి జోలికి రావటంలేదు కనక మీరు కూడా మా ఆస్తి జోలికి రాకండి. రేపు అధికారులు వచ్చే వరకు విరమణ రేఖ రెండు పక్షాలు దాటవద్దన్నది పెద్ద మనుష్యుల ఒప్పందం. సరేనా!" అంటూ ఇంజనీరు తాతకి బుల్‌డోజర్లు అప్పచెప్పి జీపుల మీద సిబ్బందిని తీసుకొని బయల్దేరాడు.

మర్నాడు అధికారులు ఎండెక్కే సమయానికి మందీ మార్బలంతో చురచురలాడుతూ వచ్చారు. అయితే ఆ పొద్దున్న వార్తాపత్రికల్లో, ప్రభుత్వం పన్నుగడని ఆటవిక జనం సాహసోపేతంగా ఎదిరిస్తున్నారని, అది చూడముచ్చటగా ఉన్నట్టూ వచ్చిన వార్తలు చదివి అధికారులు చేరుకొన్న కొన్ని గంటలకి అంతకు ముందే కొంపలు మునిగిపోయిన నిర్వాసిత జనాన్ని పోగేసుకొని జనహక్కుల నాయకులు, పర్యావరణ పరిరక్షణ సమితి జనం దిగబడసాగారు. ఆరోజు పని ముందుకు సాగలేదు.

"పోడు వ్యవసాయంలో కాలిన అడవి మళ్ళీ తిరిగి మొలకెత్తుతూనే ఉంది. ఆటవికులు వేటాడిన వన్యమృగాలు ఇన్ని వేల సంవత్సరాలుగా అంతరించలేదు. ఈనాడు అడవులు తరుగుతున్నాయి. వన్యప్రాణులు అంతరిస్తున్నాయి. దేనివల్ల? నాగరికత ప్రపంచపు అత్యాశ, వాళ్ళ కోరికలకున్న దురాశ'' అంటూ పత్రికలు పుంజుకున్నాయి. "ఆటవికులేం చేసినా అవసరానికి చేస్తారు. నాగరికులది కేవలం అత్యాశ. దాన్ని అరికట్టాలి" అని ఆ టి.వి., ఈ టి.వి. హోరెత్తాయి. ఆ ఉపన్యాసాలు, ఆ వ్యాసాలు ఫారెస్టు డిపార్టుమెంట్ వారి అతిథి గృహంలో వన్యప్రాణి మాంసంతో చేసిన వంటకాలు తిందామని కూర్చున్న మంత్రిగారికి రుచించలేదు. మాంసం కాదు. మొదటివి. ప్రధానమంత్రి ఆదేశం మేరకు ఆయన నిర్వాసితులు కాబోతున్న వారికి కొన్ని నెరవేర్చబోని వాగ్దానాలు, నెరవేర్చబోతున్న హెచ్చరికలు ఆయుధాలుగా చంకలో పెట్టుకొని, భద్రతా దళాలు ముందు పోగా బయల్దేరారు. పత్రికలవాళ్ళకి టి.వి.ల వాళ్ళకి ఆయన చెప్పలేదు. వాళ్ళే ఆచూకీపట్టి, ఆయన తిన్న మాంసం, త్రేన్పుల వాసన వెంట బయల్దేరారు.

మంత్రిగారు ఆ డామ్ సైటులో హెలికాప్టర్‌లో దిగారు. అదే సమయానికి మరో వాహనం ఆకుపచ్చ కాంతి విరజిమ్ముతూ భద్రతా వలయం అవతల, ఆకాశం నుంచి దిగింది. మంత్రిగారా ప్రదేశానికి చేరగానే అక్కడి ఆటవికులు వారికి వత్తాసుగా వచ్చిన ఆందోళనకారులు,

"బచావ్! పురజనుల స్వార్థం నుంచి, కాదు జనులను రక్షించండి" అన్న నినాదాలు చేశారు.

డామ్ దాటి వస్తున్న నీరు ఆ స్త్రీల కన్నీరులా ఉంది. జలాశయంలో నీరు, అదుపులో పెట్టుకొన్న వారి పురుషుల ఆగ్రహం లాగా అవసరం అయితే కట్టదాటి రావటానికి సిద్ధంగా ఉన్నట్టుంది. ఆ నది చుట్టూ ఉన్న కొండలు, ప్రభుత్వం యొక్క గుండెల్లా బండబారిపోయి కఠినంగా అచలాల్లాగా ఉన్నాయి. మంత్రిగారు ఆకలివేస్తున్న వారికి లంఖణాలు, అజీర్తి చేసిన వారికి జీర్ణ రసాయనాలు పంచిపెట్టే భిషగ్వరులలాగా జగన్మోహనంగా ఉన్నారు.

ఆయనవైపుగా జనం కదలసాగారు. అది చూసి పౌర సంబంధాల అధికారి భయపడి, సర్దుకుని శాంతరసం కారుతున్న భ్రమ కలిగిస్తుండగా "మీరంతా శాంతంగా నిశ్చలంగా, నిశ్శబ్దంగా ఉంటే మంత్రిగారు మీకు రెండు ముక్కలు చెప్తార' అంటూ హెలికాప్టర్‌లోని పబ్లిక్ ఎడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రకటించాడు.

"కొత్తగా చెప్పేదేమన్నా ఉంటేగా" అన్నాడు సోమయ్య వెటకారంగా. ఆ మాటలకంటే కూడా అతను పెట్టుకొన్న ఎర్రగోచీ మంత్రిగారికి నచ్చలేదు. ఆకుపచ్చ, పసుపుపచ్చ, తెలుపు, కాషాయ ఇన్ని రంగులుండగా ఆ రంగే ఎందుకు ఎన్నుకున్నాడు? అని ఆలోచనలో పడ్డాడు.

"పాచిపళ్ళ మంత్రిగారు వాక్కులు మరోసారి విందాం" అన్నాడు భీమయ్య. అతని గోచీ మాసిపోయి ఏ రంగుదో తెలియటంలేదు. ఇది కాస్త నయం అను కుని మంత్రిగారు గొంతు సవరించుకొన్నారు.

"నావి పాచిపళ్ళు కాదు. నేను రోజూ భోజనానంతరం పళ్ళు తోముకుంటాను. ఈ కట్ట ఎత్తు పెంచటం వల్ల ఎన్నో ఎకరాలు అధికంగా సాగుబడిలోకి వస్తాయి. ఇది నా కొత్త పాట ఎలా ఉంది? ఇదంతా మనకి కలిగే లాభం. ఏమంటారు?"

"ఆ ఎకరాల్లో కొద్దిగా అయినా మాకిస్తారా?" సోమయ్య అడిగాడు. "ఇవ్వండి. ఇది మా కొత్త డిమాండ్"

"అవి మావా? కావు ప్రజలవి. మేమెల్లా ఇస్తాం. తప్పుకదూ!"

"మేం ప్రజలం కామా?"

"ఎంతమాట మీరు త్యాగం చేసే ప్రజలు. వారు – ఇంతకు ముందే పల్లంలోని భూమి హక్కుదారులైన ప్రజలు. అంతే తేడా".

తేడా తెలియచేసి ఆపైన,

"దానివల్ల తిండిగింజలు ఎక్కువగా పండి దేశం సుభిక్షం అవుతుంది. ఎంతోమందికి తినడానికి తిండి

ఉంటుంది" మంత్రిగారు కొనసాగించారు.

"ఆ గింజలు మాకు పంచుతారా?" అక్క ఆశగా అడిగింది.

"ఇంత ఖర్చు పెట్టి డామ్ కడ్తున్నాం కదా! మేము రైతుల దగ్గర నీటి సుంకం వసూలు చేస్తాం. వాళ్ళు తిండిగింజలు అమ్ముతారు, వాళ్ళ పెట్టుబడి వాళ్ళు రాబట్టుకోవాలి కదా!"

"మీరు వాళ్ళకెన్నో రాయితీలు కల్పిస్తారు కదా! మాకీ తిండిగింజలు పోనీ చవకగా అమ్మిస్తారా? ఈ డామ్ కట్టడంలో మేమూ మా వంతు త్యాగం చేస్తున్నాం కదా!" అని బావ అనుమానంగా అడిగాడు.

"మీకు ఒకేసారి వాయిదాలు పెట్టకుండా నష్టపరిహారం చెల్లిస్తున్నాం కదా! వాళ్ళ ధర వాళ్ళనే నిర్ణయించుకోనిస్తాం" మంత్రిగారు ధర్మం తెలియజెప్పారు.

"మా భూములకి మేమెందుకు ధర నిర్ణయించుకోడంలేదు మీరెందుకు నిర్ణయిస్తున్నారు?" అని పురంలో చదువుకొన్న గిరిజనుడడిగాడు.

"బహుజన శ్రేయస్సుకోసం భూమిని స్వాధీనం చేసుకొనే హక్కు ప్రభుత్వానికుంది. దానికి మేమిచ్చే నష్టపరిహారం పొందే హక్కు మీకుంది" మంత్రిగారు తేల్చిచెప్పారు.

ఈ చర్చ జరుగుతున్న సమయంలో ఆకుపచ్చ కాంతితో దిగిన వాహనంలోని శాల్తీ చెవులకి వినికిడి యంత్రాలు, నోటికి మైకు, చేతికి పామ్‌టాప్ కంప్యూటర్ పెట్టుకొని దిగి గాల్లో తేలి వచ్చినట్టు నడిచి వచ్చి జనం మధ్యకి వచ్చింది.

ఆ శాల్తీ మంత్రిగార్ని ప్రశ్నించింది,

"ఎక్కువమంది మంచి కోసం కొద్దిమంది త్యాగం చెయ్యటం ధర్మమని మీరు నమ్ముతున్నారా?" అంటూ ఆ కంఠస్వరం లోహ శబ్దాన్ని పోలి ఉంది. ఆ శాల్తీ బట్టలు తెల్లని లోహంతో తయారైనట్టు నిగనిగలాడ్తున్నాయి. ఆ శాల్తీ కంఠస్వరానికి, దుస్తులకి ఆశ్చర్యపోతూనే మంత్రిగారు,

"నమ్ముతాను, అభివృద్ధి వెలుగు, నీడా ఒకేచోట పడవు కదా! అందరి కోసం కొందరు కొంత చీకటిని భరించాలి".

ఎక్కువమంది ప్రయోజనాల కోసం కొద్దిమంది తమ భూమిని జీవన విధానాన్ని వదులుకోవటం న్యాయమేనా? ఆ శాల్తీ అడిగింది.

ఈ మధ్య టి.వి.ల వాళ్ళు, పత్రికలవాళ్ళు, డాట్‌కామ్ వాళ్ళు దొంగవేషాల్లో వస్తున్నారు. తప్పుదొర్లితే తరువాత పదవి వలిచేస్తారు. కనక జాగ్రత్తగా మాట్లాడాలి అని నిర్ణయించుకొన్నారు మంత్రిగారు.


"న్యాయమే" అని ముక్తసరిగా జవాబు చెప్పారు.

"భూలోకవాసులకి నాయకులైన తమ వద్ద నుంచి ఈ జవాబు కోసమే ఎదురుచూస్తున్నాను" అంది ఆ శాల్తీ.

"తమరే లోకవాసులో" మంత్రిగారు వెటకారంగా అడిగారు.

"బ్రహ్మలోక వాసులం" నిశ్శబ్దం ఆవరించింది అంతటా.

"కొన్ని లక్షల కోట్ల విశ్వవాసుల లాభం కోసం కొన్ని వందల కోట్ల భూలోక వాసులు త్యాగం చెయ్యకతప్పదని విశ్వవాసుల ప్రతినిధులు నిర్ణయించారు" అని ఆ శాల్తీ సెలవిచ్చింది.




"మేం త్యాగాలు చెయ్యాలని నిర్ణయించటానికి మీరెవ్వరు?" మంత్రిగారు కోపంగా అడిగారు. అది ఎటువంటి త్యాగమో, ఎంత త్యాగమో తెలుసుకోకుండానే.

"మేం త్యాగం చెయ్యాలని మీరు నిర్ణయించలా!" సోమయ్య కోపంగా అడిగాడు మంత్రిగారిని.

"ఇంతకూ ఏం త్యాగం చెయ్యాలి మేము?" అపి అడిగాడు మంత్రిగారు.

"విశ్వవాసులు, అంతర్లోక సునాయాస శీఘ్ర ప్రయాణాలకి భూమి అడ్డుగా ఉందని దాన్ని పేల్చి వేయాలని నిర్ణయించారు"

"మా భూమిని పేల్చేయాలన్న నిర్ణయం మాతో చర్చించకుండా ఎట్లా నిర్ణయించారుట మీ విశ్వవాసులు!" మంత్రిగారు కోపంగా అన్నారు.

"త్యాగం చేయాల్సిన వాళ్ళు ఇతర్లయినప్పుడు, వారి అనుమతి అక్కర్లేదు అన్నది భూలోక న్యాయం అని మీరే అన్నారు కదా!"

"ఇంతకూ తమరు ఏ పత్రిక లేక ఏ టి.వి., లేక ఏ ఎన్.జి.వో. వారి తరఫున ఇంత బ్రహ్మాండమైన నాటకం



# సారాంశం

ముడితే నిలువెల్లా పులకించడం
తడితే జలజలా పారడం
ఏ ఊర్లె ఏ కడుపున పుట్టి
ఏ ఇంట్ల ఏ చేతుల్లో పెరిగి
ఎక్కడో మునిగి ఇక్కడ తేలితిమి.
మౌళికంగా గగుర్పొడిచే నొప్పి
కళ్ళల్లో నీళ్ళు ఊరడం
నానిన అరికాల్లో గుచ్చిన తుమ్మముల్లు
ప్రాణమంతా విలవిల తడతడ–
అందదు దొరకదు
మెడ మీంచి తలకాయ తెగిపడినట్టు
గండిపడ్డ నిండైన పంట కాలువ గిలగిల
వలవల–
విషయం బరువైనది బలమైనది
వస్తువు జీవితమంత విస్తారమైనది విలువైనది
కరచాలనం చేయి కలువు
ఆలింగనం చేసుకో కదుపు
గుండె వరండా మీద ఆడించుకో ముద్దాడు
తాతల తండ్రుల మౌన సంకీర్తనల మేల్కొలుపు
పరంపర
స్మరించు స్పర్శించు
చూపుడు వేలితో లేచివురు పెదవిపై చిటికేయి
పలుకరించు పరిమళించు
ఎదపై తల ఆన్చి పూన్చి చెవి ఒగ్గు
అడుగంటిన భూగర్భ స్వప్నం
తడి స్పర్శ కరువు కరుకు సంభాషణ–
కలిసి పంచుకునేది స్వల్పం
విడిపోయి తలుచుకునేది అనంతం
నిజాయితీ గతిశీలత వెలుగు
నమ్మకం అమ్మకం కర్రసాము.
ఒక్కొక్క మెట్టు భుజంతట్టి చేరుతాం
ఒక్కో తంతె వందో వంతు వేగంతో జారిపోతాం
విడిచి వచ్చిన మా ఊరిలా నువ్వో సజీవ చెలిమవు
గడిచి పోయిన బతుకులా నువ్వో కల ఉలికిపాటు.
బండబారడం, నిండా ప్రవహించడం
మనసు విరగడం దేహంగా ఆరిపోవడం
కేవలం నిట్టూర్పు సుదీర్ఘ కూర్పు
అంతా హోటల్ హడావుడి బస్టాండ్ సందడి.
నాలుగు చేతులు కల్సి ముడివిప్పిన గుప్పిలి రుద్రాక్ష
రెండు మనసులు ఒక్కటై దాచుకున్న దోరమాగిన
నల్లద్రాక్ష–
జిందాబాద్! జిందాబాద్!!
ఛానల్స్ జిందాబాద్!
జిందాబాద్! జిందాబాద్!!
గోడమీద పిల్లి జిందాబాద్!
స్వాధీనం విలీనం
అరాల్డైట్! సాల్డరింగ్!!
వెబ్! టబ్! లబ్‌డబ్! పబ్!
గుండెల్లో నలిగి వడిపెడుతున్న ఫక్తు పాప్‌సాంగ్!
వెన్నెముక నశించాలి! అమీబా వర్ధిల్లాలి!!

**–జూకంటి జగన్నాథం**

ఆడుగుతున్నారు?" మంత్రిగారింకా అపనమ్మకంతోనే ఉండి అడిగారు. అప్పుడు ఆ బ్రహ్మలోకవాసి తన లోహపు తొడుగులోంచి బయటకి జారి ఒక బంతిలా రూపుదాల్చి గాల్లో తేలుతూ "నేను మనిషిని కానని నమ్ముతారా?" అని అడిగింది. మంత్రిగారికి నమ్మకం కుదిరింది. "మీకు ఎప్పటి నుంచో చెబుతున్నాం భూమిని ఖాళీ చేసి మరో నక్షత్రానికో గ్రహానికో వెళ్ళిపొమ్మని మీరు దేనికీ సమాధానం ఇవ్వలేదు". అన్నదా బ్రహ్మలోకవాసి.

"మాకు మీ రేడియో సంకేతాలు అర్థమవలేదను కుంటాను. మీరు పంపి మా కంది ఉంటే మా సైంటిస్టులు డీకోడ్‌చెయ్యలేకపోయి ఉంటారు" అన్నాడు పౌర సంబంధాల అధికారి.

"పోనీ ఆ మాటే మాకు చెప్పచ్చు కదా!"

"ఆయనే ఉంటే.. అని మాకో సామెత ఉందిలెండి" అన్నాడు పౌ.సం.అ.

"అందుచేత మీరు పంపి మాకు అందినా, అవేం చెప్తున్నాయో మాకు అర్థమవలేదు కనక అవి చెల్లవు" అన్నారు మంత్రిగారు.

"మా చేత మీరు కాయితాల మీద వేలిముద్రలు వేయించుకొంటారు కదా! అవీ మాకర్థం అవవు! అవి చెల్లుతాయేమో!" అన్నాడు భీమయ్య వెటకారంగా.

"అబ్బాయిలూ పై గోళాల వారి విషయంలో మీరు మేమూ ఒకటే పార్టీ. భూలోక విషయాల్లో మీరు మేము వేరు." అన్నారు మంత్రిగారు.

"మీకు మరో నక్షత్రం మీద సకల ఏర్పాట్లూ చేసాం ఈ విషయం చెప్పిపోదానికి నన్ను రాయబారిగా పంపారు. మీరు ఒప్పుకొంటే సరే లేకపోతే మీరుండగానే భూమిని పేల్చేస్తాం. మాకు జైళ్ళల్లో పెట్టడం మానసిక పరివర్తనలు తేవటం మీద నమ్మకాలు లేవు."

భద్రతా దళాలు ఆయుధాలు, ఆ నభూలోక వాసి మీద ఎక్కుపెట్టారు.

ఆ శాల్తీ మెటాలిక్ శబ్దంతో నవ్వి "ఇదంతా వర్చ్యువల్ రియాలిటీ. నేను లేను. మీరు చూస్తున్నది నా వాహనం తప్ప అంతా భ్రమ. ఆ వాహనం యధార్థం. అది భూమిని లిప్తకాలంలో పేల్చేయగలదు. అందుకని మీరు కోపరేట్ చేస్తే మిమ్మల్నందరిని మరో నక్షత్రానికి తరలిస్తాం"

"అక్కడ గాలి, నీరు కలుషితం కాకుండా ఉన్నాయా?" అని పర్యావరణ పరిరక్షకులు అడిగారు.

"అక్కడ కలుషితమైనవీ లేవు. కానివి లేవు. అసలు లేవు! మీకు ఆక్సిజన్ సిలిండర్లు, వాటర్ టాంకర్లు ఇస్తాం. వాటిని రీసైకిల్ చేస్తాం. అదీ మీ తరం వరకే. ఆ నక్షత్రం మీద మీ సంతానోత్పత్తి జరగదు. జరగనీయం. మీ కంటే ముందరే భూమి నశించిపోతుంది. ఆ తరువాత కొంత కాలానికి మీరు నశిస్తారు. భూలోక వాసులు ఎన్‌డేంజర్డ్ స్పెసీస్ అంటే నామరూపాలు లేకుండా నశించటానికి సిద్ధంగా ఉన్న జాతి మానవజాతి. అందుకే మేమా నిర్ణయం తీసుకోగలిగాం"

"మేము పోయేవరకు ఆగాల్సింది మీరు" అన్నాడో మానవుడు. "లేదు ఆగం. మీకు మరోచోట ఇంతకంటే సురక్షితం, సుఖవంతం అయినచోట వేరే ఏర్పాట్లు చేసాం. ఈ భూమిని పేల్చేయక తప్పదు" ఇక్కడ మా జీవితం ఎంత బాగా లేదనుకున్నా మాకు బాగానే ఉంది. ఇది మా భూమి. ఇక్కడే పుట్టాం. ఇక్కడే చస్తాం. దాన్ని పేల్చే అధికారం మీకెవరిచ్చారు?" మంత్రిగారు కోపంగా అడిగారు.

"మా అడవులని ముంచి మమ్మల్ని తరలించే అధికారం మీ చేతుల్లోకి మీరు తీసుకొన్నట్టే, భూమిని పేల్చే అధికారం వాళ్ళకి ఎవరూ ఇవ్వలేదు. వాళ్ళే ఆపాదించుకున్నారు" అన్నాడు పురాల్లో చదువుకున్న గిరిజనుడు.

"ఆ కొత్తచోట, తెలియనిచోట బతుకు గురించి తల్చుకొంటేనే భయంగా ఉంది" అన్నాడు ఇంజినీరు.

"మమ్మల్ని ఇక్కడ నుంచి పొమ్మంటే మాకూ ఇటువంటి ఆలోచనలు రావచ్చునని మీకు అనిపించను కూడా అనిపించలేదు. మాకు ఇక్కడా తప్పదు. అక్కడా తప్పదు. అక్కడ మాకు తోడుగా మీరూ ఉంటారు. హాయ్! హాయ్!" అన్నాడు సోమయ్య.

"ఇది వివాదాల సమయం కాదు. మనమంతా ఏకమై మనభూమిని రక్షించుకోవాలి. యే ధరిత్రీకో బచావ్!" అన్నాడు మానవుడు.

ఆ ఆకుపచ్చ కాంతి వెదజల్లుతున్న ఆ యంత్రం వైపు నడిచారు అందరు మంత్రిగారితో సహా!

అందరు దానిచుట్టూ మూగాక మళ్ళీ మానవుడు "ఈ భూమిని రక్షించండి" అని నినదించాడు.

అందరు "బచావ్" అంటూ ఏకకంఠంగా అరిచారు. ప్రగతికి ప్రతీక అయిన ఆకుపచ్చరంగు కూడా భయం గొలుపుతూ ప్రకాశిస్తోంది.

*